
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



భద్రాద్రి కొత్తగూడెం

ఉష్ణోగ్రత ఖమ్మం : గరిష్ఠం 31 । కనిష్ఠం 21 | భద్రాద్రి : గరిష్ఠం 34 । కనిష్ఠం 24 సోమవారం, 5 ఫిబ్రవరి 2024

పేదల వైద్యానికి పైసలు కరువు



- ఉమ్మడి జిల్లాలో రూ.30 కోట్ల మేర ఆరోగ్యశ్రీ బకాయిలు
- నిధులు రాక ఆసుపత్రుల్లో నిలిచిపోతున్న సేవలు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలు
- శస్త్రచికిత్సలకు సవరించని ధరలు
- రోగులపై తప్పని భారం

● ఖమ్మం జిల్లా ప్రధాన ఆస్పత్రిలో గత 45రోజుల్లో 727 సర్జరీలు చేశారు. దీంతో ఈ ఆస్పత్రి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి ఉత్తమ అవార్డు పొందింది. ఈ ఆస్పత్రిలో సత్యప్రసాద్ అనే 60 ఏళ్ల వృద్ధుడికి ఆరోగ్యశ్రీ కింద మోకీలు ఆపరేషన్ చేశారు. దీనికి ఓ ప్రైవేటు కాంట్రాక్టరు నుంచి ఇంప్లాంట్స్‌ను తెప్పించి వినియోగించారు. కానీ ఆరోగ్యశ్రీలో నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టరు ఇంప్లాంట్స్‌ను సరఫరా చేసేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో వైద్యులు శస్త్ర చికిత్సలనే నిలిపివేశారు.

● ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రక్త శుద్ధి (డయాలసిస్‌కు) సేవలు పొందేందుకు ఆరోగ్యశ్రీ ద్వారా సదుపాయాన్ని కల్పించారు. 30 మంది రోగులు ఈ సేవలు పొందవచ్చు. కానీ ఈ ఆస్పత్రికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.6కోట్ల బకాయిలు ఉండంతో యాజమాన్యం వారు సేవలు అందించలేకపోతున్నారు.

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 4: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో పేదలు నాణ్యమైన వైద్య సేవలు పొందలేకపోతున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉమ్మడి జిల్లాకు రావాల్సిన నిధులు రూ.30కోట్ల మేరకు పేరుకుపోయాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సేవలను నిరాకరిస్తున్నారు. ఫలితంగా నిరుపేదలు సరైన వైద్య సేవలు పొందలేకపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ సేవలను రూ.10లక్షలకు విస్తరించినా పేదలు ఆ మేరకు సేవలు పొందలేకపోతున్నారు. 2011లో ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లకు నిర్ధారించిన రుసుమును ఇప్పటి వరకు సవరించకపోవడంతో యాజమాన్యాలు పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నారు. పరికరాల ధరలు రెట్టింపు కావడంతో గిట్టుబాటు కావడం లేదని వారు పేర్కొంటున్నారు. దీంతో ఆపరేషన్ల భారం పేద రోగులపై పడుతోంది.

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయంలో ఆరోగ్యశ్రీ పథకం రూపుదిద్దుకుంది. ఆర్థికంగా స్థోమత లేని నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలకు ఈ పథకం ద్వారా అప్పట్లో ఎంతో మేలు జరిగింది. ఉమ్మడి జిల్లాలో 2008లో ఆరోగ్యశ్రీ పథకం అమల్లోకి రాగా సుమారు 1,028 రకాల వైద్య సేవలు ఉచితంగా రూ.2లక్షల వరకు వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు. దీంతో లక్షలాది మంది ప్రయోజనం పొందారు.

అనంతరం 2021లో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం అందుబాటులోకి తీసుకొచ్చి రూ.5లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందే అవకాశం కలిగింది. ఈ పథకం ద్వారా మొత్తం 646 రకాల వ్యాధులకు సేవలు పొందే అవకాశం లభించింది. తాజాగా వచ్చిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన ప్రతీ కుటుంబం ఏడాదికి రూ.10లక్షల వరకు వైద్య సేవలు ఉచితంగా పొందవచ్చు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, గైనిక్, పీడియాట్రిక్, ఈఎన్‌టీ, కంటి, ఎమర్జెన్సీ, ట్రామా, డయాలసిస్ తదితర వ్యాధులకు చెందిన సుమారు 1,672 రకాల వైద్యసేవలు పొందవచ్చు.

ఉమ్మడి జిల్లాలో 39ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో ఏడు ప్రభుత్వ ఆస్పత్రులు, 18 నెట్‌వర్క్ (ప్రైవేట్) ఆస్పత్రుల్లో ఈ సేవలు వినియోగించుకోవచ్చు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 9 ప్రభుత్వ ఆస్పత్రులు, 10 ప్రైవేట్ ఆస్పత్రుల్లో సేవలు పొందవచ్చు. ఖమ్మం జిల్లాలో 4,11,347 కుటుంబాలు, భద్రాద్రి జిల్లాలో 2.98.822 కుటుంబాలు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద లబ్ధి పొందేందుకు అర్హత కలిగి ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 2014 నుంచి 2023 మార్చి వరకు ప్రభుత్వ పరంగా 6,284 ఆరోగ్యశ్రీ కేసులకు చికిత్స అందించగా రూ.19.98 కోట్లు ఖర్చయ్యాయి. అలాగే ప్రైవేట్ పరంగా 56,881 కేసులు నిర్వహించగా రూ.165.81 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. అలాగే, భద్రాద్రి జిల్లాలో 7,306 కేసులకు రూ.13.92కోట్లు ఖర్చు చేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో 3,986 కేసులకు సేవలందిస్తే రూ.12.28 కోట్లు ఖర్చయింది.

సేవలు నిలిచిపోయే ప్రమాదం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీలో రూ.30కోట్ల బకాయిలున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఖమ్మంలో ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.10కోట్లు, ప్రైవేటు ఆస్పత్రులకు రూ.18కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు కలిసి రూ.4కోట్లు బకాయిలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి నిధులు విడుదల చేస్తే తప్ప ఆరోగ్యశ్రీ సేవలు మెరుగుపడే అవకాశం లేదని పేర్కొంటున్నారు. బిల్లులు చెల్లించకుంటే మూకుమ్మడిగా ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసేందుకు యోచిస్తున్నట్లు తెలిసింది.

నేడు ఖమ్మంలో మంత్రి తుమ్మల పర్యటన



ఖమ్మం, సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 4: ఖమ్మం నగరంలో సోమవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి ఉదయం 9గంటలకు ఖమ్మానికి చేరుకున్న తరువాత 13వ డివిజన్‌లోని మధురానగర్‌లో పర్యటించనున్నారు. అనంతరం ప్రభుత్వ మెడికల్ కాలేజీని పరిశీలిస్తారు. తర్వాత తన క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం నుంచి 24, 25, 35 39, 45 డివిజన్లలో మంత్రి పర్యటిస్తారు. ఈ మేరకు ఖమ్మం క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

ఎస్సీ గురుకులాల

ఎక్సలెన్స్ పరీక్ష ప్రశాంతం

ఖమ్మం రీజియన్‌లో 9,351మంది విద్యార్థుల హాజరు



ఖమ్మం పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ సెక్రటరీ శారద

ఖమ్మం సంక్షేమవిభాగం/పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 4: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లోని సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కాలేజీల్లో ఇంటర్ ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలోని పరీక్షా కేంద్రాలను జాయింట్ సెక్రటరీ శారద, ఆర్సీవో ప్రత్యూష పర్యవేక్షించారు. జాయింట్ సెక్రటరీ శారద ఎర్రుపాలెం, వైరా, ముదిగొండ, ఖమ్మం అంబేద్కర్ కాలేజీలను తనిఖీ చేశారు. ఆర్సీవో ప్రత్యూష కూసుమంచి, మర్రిపెడ, తొర్రూరు, నర్సింహులపేట కేంద్రాలను పరిశీలించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 9,667మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా వారిలో 9,351మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వారిలో బాలురు 3,392 మంది, బాలికలు 5,959మంది ఉన్నారు. మొత్తం 96.73శాతం హాజరు నమోదైందని ఆర్సీవో ప్రత్యూష వెల్లడించారు.

తప్పుల తిప్పలు!

- జనన, మరణ ధ్రువీకరణ పత్రాల్లో అక్షర దోషాలు
- మార్చుకునేందుకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

7

తాలిపేరులో దీవి

- 48 ఏళ్లుగా అక్కడే నివాసముంటున్న ఒడిశా కుటుంబం
- రిజర్వాయర్‌లో చేపల వేట, కూరగాయల సాగుతో జీవనం

6

పంటలు కాపాడండి

- పాలేరు పాతకాల్వకు నీరు విడుదల చేయాలని రైతుల ఆందోళన
- నిరాకరించిన అధికారులు
- గేట్లెత్తి నీరు విడుదల చేసిన రైతులు
- పోలీసుల పహారాతో మళ్లీ గేట్లు మూసిన అధికారులు
- పాలేరు జలాశయం వద్ద ఉద్రిక్తత

కూసుమంచి, ఫిబ్రవరి 4: కూసుమంచి మండలం పాలేరు జలాశయం వద్ద ఆదివారం మధ్యాహ్నం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇటీవల యాసంగిలో సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని, నీరు విడుదల చేసి ఆదుకోవాలని రైతులు కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ నుంచి పాలేరుకు నీరు విడుదల చేయడంతో జలాశయం నీటి మట్టం 15 అడుగులకు పెరిగింది. దాంతో ఆదివారం పాత కాల్వ పరిధిలోని రైతులు మాజీ సీడీసీ ఛైర్మన్ జూకూరి గోపాలరావు, రైతుసంఘ నాయకులు తోటకూరి రాజు, బొక్క నర్సింహరెడ్డి, బాసు తదితరుల ఆధ్వర్యంలో సుమారు 200 మంది పాలేరు జలాశయానికి చేరుకొని తమ పంటలు కాపాడేందుకు కాల్వకు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అందుకు నీటిపారుదలశాఖ అధికారులు అనుమతి నిరాకరించారు. దీంతో ఆగ్రహించిన రైతులు నీరు విడుదల చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. దాంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.



రైతులతో చర్చిస్తున్న ఖమ్మం ఆర్డీవో గణేష్, రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, ఐబీ అధికారులు

గేట్లెత్తి నీరు విడుదల చేసిన రైతులు

పాలేరు జలాశయం నుంచి పాతకాల్వకు నీరు విడుదల చేసేందుకు అధికారులు అనుమతి నిరాకరించడంతో ఆగ్రహించిన రైతులు ఐబీ సిబ్బంది నుంచి గేట్ల తాళాలు తీసుకుని కాలువ గేట్లు ఎత్తి స్వయంగా నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పాలేరు పాతకాల్వ పరిధిలో సుమారు 15వేల ఎకరాల్లో వరి, చెరకు పంట సాగవుతోందని, ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు నీరు విడుదల చేయకపోతే తీవ్రంగా నష్టపోతామని తెలిపారు. అయినా అధికారులు స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలేరు జలాశయంలో నీరు ఉన్నా లేకున్నా పాతకాల్వకు నీరు విడదల చేయాలని జీవో ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



పాలేరు జలాశయం వద్ద రైతుల ఆందోళన

పోలీసు పహారాతో నీటి సరఫరా నిలిపివేత

పాలేరు వద్ద ఉద్రిక్తత విషయం తెలుసుకున్న ఖమ్మం ఆర్డీవో గణేష్, ఖమ్మంరూరల్ ఏసీపీ బస్వారెడ్డి, ఐబీ ఈఈ అనన్య, మంగళపూడి వెంకటేశ్వరరావు తదితరులు అక్కడి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కూసుమంచి సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. పాలేరు జలాశయంలోని నీరు ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల తాగునీటి అవసరాలకు అందిస్తున్నందున, సాగుకు నీరు ఇవ్వడం కుదరదని అధికారులు నచ్చజెప్పారు. దీనిపై రైతు ప్రతినిధులు జూకూరి గోపాలరావు, తోటకూరి రాజుతో చర్చించి పరిస్థితిని వివరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు. జిల్లా ప్రజాప్రతినిధులు తమ సమస్యను అర్థం చేసుకుని నీటి విడుదలకు చొరవ చూపాలని రైతులు కోరారు. పాలకాల్వకు నాలుగు రోజులపాటు కనీసం 50 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేయాలని కోరుతున్నారు.

భద్రాద్రి కళాభారతి సేవలు శ్లాఘనీయం

- 22వ అంతర్రాష్ట్రస్థాయి నాటకోత్సవాల్లో వక్తలు
- ఆలోచింపజేసిన 'స్వప్నం రాల్చిన అమృతం'

భద్రాచలం, ఫిబ్రవరి 4: నాటక రంగానికి భద్రాద్రి కళాభారతి సేవలు శ్లాఘనీయమని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సహా పలువురు వక్తలు పేర్కొన్నారు. భద్రాచలంలో ఆదివారం రాత్రి 22వ అంతర్రాష్ట్రస్థాయి సాంస్కృతిక సంబరాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నాటక రంగానికి రెండు దశాబ్దాలుగా భద్రాద్రి కళాభారతి అందిస్తున్న సేవలు అజరామరమన్నారు. అంతరించిపోతున్న నాటక రంగానికి మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో జీవం పోసేందుకు ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న ప్రయత్నాన్ని వక్తలు అభినందించారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా భద్రాద్రి దేవస్థానం వేద పండితుడు చిట్టి హనుమత్‌శాస్త్రికి ఆత్మీయ సన్మానం చేశారు. సూపర్‌సింగర్-3 విన్నర్‌గా నిలిచిన ఏపీలోని కర్నూలు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అవినాష్ జయసింహకు సైతం ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన సినిమా పాటలు పాడి ప్రేక్షకులను అలరించారు. తెల్లం రిషిత నృత్య ప్రదర్శన, ఖమ్మం, కొత్తగూడెం జిల్లా కళాకారుల జానపద హంగామ ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రత్యేక సబ్‌జైలు సూపరింటెండెంట్ ఉపేందర్, అధ్యక్షుడు పాకాల దుర్గా ప్రసాద్, తాళ్లూరి ట్రస్ట్ ఛైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య, తిప్పన సిద్దులు, గట్టు వెంకటాచార్య, తాళ్లపూడి రాము, సానికొమ్ము బ్రహ్మారెడ్డి, తాండ్ర వెంకటరమణారావు, వంశీకృష్ణ, కృష్ణారెడ్డి, భూపతిరావు, వనజా మోహన్‌రావు, సినీ జానపద గాయకుడు జాన్ పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'స్వప్నం రాల్చిన అమృతం'

కరీంనగర్ చైతన్యకళాభారతి వారు ప్రదర్శించిన 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. రచన పరమాత్ముని శివరాం కాగా రమేష్ మంచాల దర్శకత్వంలో ప్రదర్శించిన ఈ నాటిక నేటి సమాజంలో బంధాలు, అనుబంధాల విలువలను కళ్లకు కట్టినట్లు చూపింది.



భద్రాచలం దేవస్థానం వేదపండితుడు హనుమత్‌శాస్త్రిని సన్మానిస్తున్న దృశ్యం



కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు ఇచ్చిన మహిళా కౌన్సిలర్లు(ఫైల్)

నెగ్గేనా.. తగ్గేనా?

- ఇల్లెందు మునిసిపల్ ఛైర్మన్ డీవీపై నేడు అవిశ్వాస ఓటింగ్
- తీర్మానం నెగ్గేందుకు మేజిక్ ఫిగర్ 17
- ఊగిసలాటలో జంప్‌జిలానీలు
- వ్యూహ, ప్రతి వ్యూహాల్లో ఇరు వర్గాలు

7

ఓవర్ టేక్ ప్రాణం తీసింది

- ట్రాక్టర్ కింద పడి బైకర్ మృతి
- డ్రైవర్ సడన్ బ్రేక్‌తో ట్రాలీ పల్టీ
- 11మంది కూలీలకు గాయాలు
- క్షతగాత్రుల్లో ఆరుగురు చిన్నారులు
- బోనకల్ ఆర్‌వోబీపై ఘటన

6



108లో గాయపడ్డ కూలీలు

నాయకులను రౌడీషీటర్లుగా ప్రకటించటం దారుణం

- అక్రమ కేసులపై మంత్రులు తుమ్మల, పొంగులేటి స్పందించాలి
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి 4: మాస్ లైన్ పార్టీ జాతీయ మహాసభల సందర్భంగా జరిగిన వాల్ పెయింటింగ్ వివాదంలో సద్దుమణిగిన గొడవ విషయంలో ఖమ్మం పోలీసు కమిషనర్ స్వయంగా జోక్యం చేసుకొని ప్రజాపంథా నాయకులపై అక్రమ కేసులు బనాయించి రౌడీషీటర్లుగా పత్రికా ప్రకటనలు విడుదల చేసి ప్రజాఉద్యమాలు చేసే నాయకులను అణిచివేసేందుకు చూస్తున్నారని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. రాజకీయనాయకులను రౌడీషీటర్లుగా పోల్చటం ఆయన నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోటు రంగారావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమకారులకు పోలీసు కేసులు కొత్తకాదని, కానీ రౌడీషీటర్లుగా పోలీసు అధికారులు పత్రికా ప్రకటనలు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజా ఉద్యమాలు చేసే వారికి నేరప్రవృత్తి ఎలా ఉంటుందని పోటు రంగారావు ప్రశ్నించారు. అణిచివేయటం పోలీసు అధికారి సునిల్‌దత్‌కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. గతంలో కామ్రేడ్ లింగన్న ఎన్‌కౌంటర్‌ను ఆయనే దగ్గరుండి చేయించారని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో పోలీసుల సమక్షంలో గంజాయి, మట్టి మాఫీయాలను పనిచేస్తున్నాయని, దమ్ముంటే వారిపై రౌడీషీట్ పెట్టాలని డిమాండ్ చేశారు. 2004లో విద్యార్థి సంఘం నాయకుడిగా ఉన్న అశోక్ ఆనాటి ముఖ్యమంత్రి సభలో నినాదాలు చేసినందుకు అతడిపై అప్పుడు రౌడీషీట్ నమోదు చేసి తర్వాత తొలగించారన్నారు. కానీ రెండు రోజుల క్రితం జరిగిన వాల్‌పెయింటింగ్ వివాదంలో అశోక్ పెద్ద మనిషిగా సంఘటన ప్రాంతానికి వెళ్లారని, అటువంటి నాయకులపై రౌడీషీటర్‌గా ఎలాప్రకటిస్తారని ప్రశ్నించారు. ఈ సంఘటనపై ప్రజాస్వామికవాదులు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. పోలీసు అధికారి తీరుకు నిరసనగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పోటు రంగారావు ప్రకటించారు. సమావేశంలో ప్రజాపంథా జిల్లాకార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరావు, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, బందెల వెంకయ్య, కే అర్జున్‌రావు, ఝాన్సీ, మంగతాయి, కే శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోటు రంగారావు

తాలిపేరులో దీవి

» 46 ఏళ్లుగా అక్కడే నివాసముంటున్న ఒడిశా కుటుంబం
» తాలిపేరులో చేపలు పడుతూ.. కూరగాయలు సాగుచేస్తూ జీవనం

చర్ల, ఫిబ్రవరి 4: నిండుగా తాలిపేరు జలాలు.. కానీ ఆ ప్రాంతాన్ని చేరుకోవు. మెండుగా వర్షాలు కురిసినా ఆ ప్రాంతాన్ని ఏమీ చేయలేవు. చుట్టూ చెట్లు, ఎటు చూసినా పచ్చదనమే. పైగా జలపుష్పాలు, వివిధ రకాల పక్షులు అక్కడ సందడి చేస్తుంటాయి. కాలుష్యం అనే మాట ఉండదు. రగగొణ ధ్వనులు ఉండవు. మరీ ముఖ్యంగా మనుషుల అలికిడి ఉండదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ప్రకృతి రమణీయత.. అణువణువూ స్వచ్ఛమైన సంభావ్యత. కానీ అలాంటి చోట ఓ కుటుంబం నివసిస్తోంది. అది కూడా నాలుగు దశాబ్దాలుగా.. చేపలుపడుతూ.. కూరగాయలు సాగు చేస్తూ జీవనం సాగిస్తోంది.

ఎత్తయిన దీవి

మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఉన్న తాలిపేరు వాగులో ఎత్తయిన దీవి లాంటి ప్రాంతం ఉంది. ప్రస్తుతం అక్కడ ఒడిశాకు చెందిన సరస్వతి, కృష్ణ కుటుంబం నివాసం ఉంటోంది. అక్కడే చేపలు పట్టి జీవనం సాగిస్తున్నారు. గతంలో నాలుగు కుటంబాలు



దీవిలో నివాసం ఉంటున్న కృష్ణ, సరస్వతి దంపతులు

ఉండేవి. వారంతా వెళ్లిపోగా.. తాము మాత్రమే 46 ఏళ్లగా దీవిలో ఉంటున్నామని సరస్వతి, కృష్ణ చెబుతున్నారు. కాగా, ఈ కుటుంబం ఉన్న ప్రాంతం చుట్టూ నీరు, చెట్లతో నిండి ఉంది. వాళ్లు బాహ్య ప్రపంచంలోకి రావాలన్నా, ఇతర చోటుకు రాకపోకలు సాగించాలన్నా పడవలే ఆధారం. భారీ వర్షాలు కురిస్తే వరద పెరుగుతుంది. వారి ఇల్లును మాత్రం నీరు ముంచదు. కానీ జాగ్రత్త కోసం దీవి నుంచి కృష్ణ, సరస్వతి కుటుంబ సభ్యులు బయటకు వస్తారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రి వేళల్లో డీజిల్ దీపం వినియోగిస్తారు. ఈ ప్రాంతం ఆహ్లాదంగా ఉండటంతో ఎంతో ఇష్టంగా జీవిస్తున్నామని కృష్ణ సరస్వతి చెబుతున్నారు. కాగా కృష్ణ, సరస్వతి ఆ దీవి లో కూరగాయలు పండిస్తూ, వివిధ జాతుల చెట్లను పెంచుతున్నారు. ఆ కూరగాయలు అమ్మగా వచ్చే పైసలు తమ కటుంబ అవసరాలు తీర్చుతున్నా యని సరస్వతి, కృష్ణ చెబుతున్నారు.



తాలిపేరు ఒడ్డున పచ్చని చెట్లతో ఆహ్లాదంగా దీవి

పంట దిగుబడికి.. రైతు రాబడికి..

ఆంధ్రజ్యోతి కృషి

» మేలైన సస్యరక్షణ చర్యలతోనే తెగుళ్ల నివారణ
» ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో యాజమన్య పద్ధతులు అవశ్యం
» క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యటన.. రైతులకు పలు సూచనలు

వాతావరణంలో సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మంచు విపరీతంగా కురుస్తోంది. దీంతో సాగు చేసిన పంటల్లో వివిధ రకాల తెగుళ్ల కన్పిస్తున్నాయి. ముఖ్యంగా వరి, మినప, పెసర వంటి ఆహార ధాన్య పంటలతో పాటు మామడి వంటి ఉద్యాన తోటలకు రకరకాల తెగుళ్ల సోకుతున్నాయి. ముఖ్యంగా జింక్ ధాతు లోపం కన్పిస్తోంది. ఈక్రమంలో పంటలను కొత్తగూడెం ఉద్యాన, పటుపరిశ్రమల శాఖ అధికారి జినుగు మరియన్న, మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణీదేవి, శాస్త్రవేత్త నాగస్వాతి, కేవీకే కీటక శాస్త్రవేత్త డాక్టర్ వి. లక్ష్మీనారాయణమ్మ, శాస్త్రవేత్తలు, డాక్టర్ ఎస్.నవీన్, డాక్టర్ ఆర్.శ్రీనివాస్, డాక్టర్ బి. శివ కొన్ని రోజులుగా ఇరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. వరి, మినుము, పెసర, మొక్కజొన్న, వేరుశనగ, మామిడి తోటలను పరిశీలిస్తున్నారు. వరి పసుపుపచ్చగా మారడం, మినుము, పెసరలో మొజాయిక్ తెగులు, మొక్కజొన్నలో రసం పీల్చు పురుగు, కత్తెరు పురుగు వంటి తెగుళ్లను పరిశీలించారు. మామిడిలో పూత మాడిపోవడం, కాయ రాలడం వంటి లక్షణాలను గమనించారు. ఈనేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు.

-కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి)/ మధిర



మినుమును పరిశీలిస్తున్న ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు



వరి రైతులకు సూచనలిస్తున్న ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు

వరిలో..

వరిలో జింక్ ధాతులోప నివారణకు లీటర్ నీటిలో రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. పిలకలు లేదా దుబ్బు చేసే దశలో కార్బోఫ్యూరాన్ 3-జీ గుళికలను ఎకరానికి 10 కిలోల చొప్పున లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4-జీ గుళికలను 8 కిలోల చొప్పున లేదా క్లోరాంట్రానిల్ ప్రోల్ 0.4జీ 4కిలోలు వేయాలి. పొట్టదశలో క్లోరాంట్రానిల్ ప్రోల్ 0.3 మి.లీ. లేదా టెట్రానిలిప్రోల్ 0.5మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మొక్కజొన్న..

మొక్కజొన్న పంట మోకాలు లోతు ఎత్తుదశలో ఉంది. ప్రస్తుత అక్కడక్కడ కాండం తొలుచు పురుగు కనిపిస్తోంది. దీని నివారణకు సిఫారసు చేసిన పొటాషియం ఎరువులను పైపాటుగా వేయాలి. పూత సమయంలో పంట బెట్టకు గురికాకుండా చూసుకోవాలి. పొలంలో నీరు నిలవకుండా చూసుకోవాలి. బ్లీచింగ్ పౌడర్‌ను ఎకరాకు 4కిలోల చొప్పున వేసుకోవాలి. 3గ్రా. కాపర్ ఆక్సి క్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లచుట్టూ పోయాలి. కత్తెర పురుగు నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.4మి.లీ. లేదా స్పైనటోరం 0.5మి.లీ. మందును లీటరు నీటికి కలిపి ఆకు సుడుల లో పల తడిచేల పిచికారీ చేసుకోవాలి. మోకాలు ఎత్తు దశలో ఉన్న పైరులో ఒక కిలో సున్నం, 9కిలోల ఇసుకను కలిపి మొక్క సుడులలో వేసి కత్తెర పురుగు నివారించవచ్చు.

వేరుశనగ

వేరుశనగలో కాయ అభివృద్ధి దశలో ఆలస్యంగా వచ్చే టిక్కా ఆకుమచ్చ తెగులు నివారణకు రెండు గ్రా. క్లోరోథాలోనిల్ లేదా 1మి.లీ. టైబుకోనజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి

పెసర, మినుము

పెసర, మినుమలో రసం పీల్చే పురుగు, తెల్లదోమ. ఎల్లో మొజాయిక్ లేదా పల్లాకు తెగులు నివారణకు ఎసిట్రామిప్రిడ్ 40గ్రా. లేదా మిథైల్ డెమటాన్ 400మి.లీ. ఎకరాకు సరిపడా నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. తామర పురుగు నివారణకు.. ఎసిఫేట్ 200గ్రా. లేదా ఫిప్రొనిల్ 400 మి.లీ. లేదా స్పైనోశాడ్ 60మి.లీ. ఎకరాకు సరిపడా నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. పేనుబంక నివారణకు డైమిథోయేట్‌ను పిచికారీ చేయాలి

మామిడి

ప్రస్తుతం మామిడి పంట పూత, పిందె దశలో ఉంది. ప్రస్తుత వాతావరణంలో మామిడిలో తేనెమంచు పురుగులు, తామర పురుగు, బూడిద తెగులు నివారణకు. 0.5గ్రా. థయోమిథాక్సామ్ 2మి.లీ. హెక్సాకోనజోల్, 2.5మి.లీ. వేపనూనె లేదా 0.3గ్రా డైనోటెఫ్యూరాన్, 1గ్రా. కార్బండిజమ్, 2.5 మి.లీ. వేపనూనె లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. తామర పురుగు తీవ్రంగా ఉంటే ఫిప్రొనిల్ 2ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. పూత పిందె రాలుతుంటే దాని నివారణకు... ప్లానోఫిక్స్ 2మి.లీ. మందు 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.



మామిడితోటను పరిశీలిస్తున్న అధికారులు

రివర్ క్రాస్ పోటీలలో నగర స్విమ్మర్ల ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 4: ఆదివారం విజయవాడలో జరిగిన కృష్ణా రివర్ క్రాస్ (1.5 కి. మి) ఈత పోటీలలో నగర స్విమ్మర్లు సత్తా చాటి పతకాలు సాధించారు. సర్దార్ పటేల్ స్టేడియం స్విమ్మింగ్‌పూల్, మున్నేరులో నిత్యం సాధన చేసే నగర స్విమ్మర్లు సీనియర్స్ విభాగంలో కాసంనేని నాగ రాజు, మన్నె శ్రీను, సిరిగల శ్రీనివాసరావు, వేపూరి రవికుమార్, చింతనిప్పు రవి, సూదగాని సురేందర్, నర్సింహరావు, ఐ. రవి, కృష్ణ, రాజు తదితరులు టాప్ 10లో నిలిచి పతకాలు సాధించగా, అండర్-11 నుంచి అండర్-18 విభాగంలో మోక్ష, భాగవత్, ఆశిష్ వరుసగా 5,6,7 స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా ఈత పోటీలలో ప్రతిభ చూపిన స్విమ్మర్లను లెఫ్ట్ కెనాల్ స్విమ్మర్స్ అసోసియేషన్ బాధ్యులు శాగంటి వెంకటేశ్వరరావు, బండి వెంకటేశ్వర్లు, గోపాలపురం వెంకటాచారి, మండేపూడి సత్యనారాయణ, కొమ్ము విజయచందర్ తదితరులు అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.



పతకాలు సాధించిన నగర స్విమ్మర్లు

వాలీబాల్ కప్ విజేతలకు బహుమతుల అందజేత

కల్లూరు, ఫిబ్రవరి 4 కల్లూరులో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో జరిగిన వాలీబాల్ కప్ విజేతలకు శనివారం రాత్రి ఎస్ఐ షాకీర్ బహుమతులందించారు. మూడు రోజుల నుంచి అంబేద్కర్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఈ పోటీలు శుక్ర, శని ఆది వారాల పాటు జరిగా. ఇందులో ప్రథమ బహుమతిని కప్పలబంధం టీం గెలుచుకోగా, కాంగ్రెస్ నాయకుడు బాగం ప్రభాకర్ రూ. 30 వేలు నగదు బహుమతిని అందించారు. ద్వితీయ ములకలపల్లి పోలీసు టీం దక్కించుకుంది. న్యాయవాది పెద్దబోయిన నరిసింహారావు రూ.20,016 నగదు బహుమతిని అందించారు. తృతీయ బహుమతి ఖమ్మం టీం దక్కించుకుంది. కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు తన సతీమణి పద్మావతి జ్ఞాపకార్థం రూ.10,016 అందించారు. నాలుగో బహుమతిని కాంగ్రెస్ నాయకుడు పాపబత్తిని నగేష్ తన మాతృమూర్తి మాణిక్యమ్మ జ్ఞాపకార్థం 7,016 నగదును అందించారు. మెమెంటోలను ఉబ్బన గోపాలస్వామి, ఉబ్బన దేవదాసు, హోటల్ చౌదరి అధినేత చల్లగొళ్ల వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ కమిటీ నిర్వాహకులు నరేష్, కొంగా రామకృష్ణ, నవీన్, రాజు, రాకేష్, మరియన్న, కాంగ్రెస్ నాయకులు దామాల రాజు, జాజీ, భూక్యా శివకుమార్ నాయక్ పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 4: మండల పరిధిలోని మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని జి.కావ్య రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఝాన్సీరాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కల్లూరులో నిర్వహించిన పోటీల్లో జిల్లా స్థాయి ఖోఖో జట్టుకు కావ్య ఎంపికయినట్లు ఆమె ఈసందర్భంగా పేర్కొన్నారు. ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు భువనగిరిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయిన విద్యార్థిని కావ్యను కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

9.7 కిలోల ఎండుగంజాయి పట్టివేత

సుజాతనగర్, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలో పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా 9.7 కిలోల గంజాయి పట్టుబడింది. ఇందుకు సంబంధించిన వివరాలను కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్ ఆదివారం విలేకరులకు వెల్లడించారు. సుజాతనగర్ పోలీసులు శనివారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా చుంచుపల్లి తండాకు చెందిన కున్సోత్ గణేష్, కున్సోత్ ప్రదీప్, సుజాతనగర్ మండలం సర్వారానికి చెందిన మాలోత్ విజయ్ కొత్తగూడెం నుంచి ఖమ్మం ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. సుజాతనగర్ వద్దకు వచ్చారు. ఈక్రమంలో పోలీసులు వారి వాహనం తనిఖీ చేయగా.. అందులో 9.7 కిలోల ఎండుగంజాయి లభ్యమైంది. ఈక్రమంలో పోలీసులు ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు విజయ్ పరారయ్యాడు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.1.81 లక్షలు ఉంటుందని కొత్తగూడెం డీఎస్పీ తెలిపారు. నిందితులు ఉపయోగించిన బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను ఎస్ఐ ఎం సోమేశ్వర్ ఆధ్వర్యంలో పట్టుకోగా, చుంచుపల్లి సీఐ పెద్దన్న కుమార్ ఆధ్వర్యంలో కోర్టుకు తరలించారని డీఎస్పీ వివరించారు. గంజాయి రవాణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భర్త ఎదుటే భార్యను లోబరుచుకునే యత్నం

పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయిన నిందితుడు

కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

పాల్వంచ, ఫిబ్రవరి 4 : భర్త ఇంట్లో ఉండగానే అతని భార్యను లోబరుచుకునేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై పాల్వంచ రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం తేజావత్ పద్మ తన భర్త సురేష్‌తో కలసి కోడిపుంజులవాగులో నివాసముంటోంది. అదే గ్రామంలో నివాసముంటున్న భూక్యా రవి ఆమెపై కన్నేశాడు. ఆమెను శారీరకంగా లోబరచుకోవాలని కుట్ర పన్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం పద్మ ఇంట్లోకి ప్రవేశించాడు. వంటింట్లో ఉన్న పద్మను శారీరకంగా లోబరచుకోవాలని ప్రయత్నిస్తూ ఆమెను బెదిరించాడు. దీంతో ఆ అరుపులకు ఆ గదిలోకి చేరిన సురేష్ రవి తన భార్యపట్ల అసభ్యంగా ప్రవర్తించడం గమనించి అతడిని పట్టుకోవడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలోనే రవి అక్కడ నుంచి చాకచక్యంగా తప్పించుకుని పారిపోయడు. దీంతో పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

బైక్ ఢీకొని మహారాష్ట్ర కూలీకి గాయాలు

కామేపల్లి, ఫిబ్రవరి 4: నడుచుకుంటూ వెళ్తున్న మహారాష్ట్ర కూలీలను ఓ బైక్ ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈసంఘటన కామేపల్లి మండల పరిధిలోని అబ్బాస్‌పురం ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన వలస కూలీలు ముచ్చర్లక్రాస్ రోడ్డు నుంచి సాతానిగూడెం రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో అబ్బాస్‌పురం గ్రామ సమీపంలో సాతానిగూడేనికి చెందిన ప్రసాద్ వెనక నుంచి వచ్చి బైక్‌తో ఢీకొన్నాడు. ఈ ఘటనలో సంకేత్ అనే కూలీకి తొంటికి తీవ్రగాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. మండలంలో మిరప కాయల కోతలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో ఉపాధి నిమిత్తం మహారాష్ట్ర కూలీలు ఇక్కడికి వచ్చారు. ఆదివారం మిరప కోతలకు వెళ్లి వస్తుండగా.. బైక్ ఢీకొనడంతో సంకేత్ తీవ్రంగా గాయపడ్డాడు.

ఓవర్‌టేక్ ప్రాణం తీసింది

ట్రాక్టర్ కిందపడి బైకర్ మృతి » డ్రైవర్ సడన్ బ్రేక్‌తో ట్రాలీ పల్టీ: 11 మందికి గాయాలు
» క్షతగాత్రుల్లో ఆరుగురు చిన్నారులు » బోనకల్ ఆర్వోబీపై ఘటన

బోనకల్, ఫిబ్రవరి 4: ఓ ద్విచక్రవాహనదారుడి అత్యుత్సాహం ప్రమాదానికి కారణమైంది. ఈఘటనలో అతడు ప్రాణాలు కోల్పోగా.. 11 మంది గాయపడ్డారు. అందులో ఆరుగురు చిన్నారులున్నారు. ఈఘటన రావినూతలలో జరిగింది. బోనకల్ మండలం రావినూతల గ్రామానికి చెందిన 16 మంది కూలీలు ముదిగొండ మండలం బాణాపురం గ్రామం లో మిర్చిలో తాలుకాయ ఏరేందుకు వెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా బోనకల్ ఆర్వోబీపై బోనకల్ వైపునకు వెళుతున్న రెండు ద్విచక్రవాహనదారులు ఒకరినొకరు ఓవర్‌టేక్ చేసుకునే ప్రయత్నంలో ఒక బైక్‌పై ఉన్న యండ్రాతి వెంకటేశ్వర్లు(45) ఎదురుగా వస్తున్న కూలీల ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ సడెన్‌గా బ్రేకు వేయడంతో ట్రక్కు పల్టీ కొట్టింది. అందులో ఉన్న కూలీలు వంతెన రక్షణ గోడకు తగిలి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో కూలీలు బోయినపల్లి ఉమ, చేబ్రోలు మంగమ్మ, బోయినపల్లి రమ్య, బందం ఉమ, బోయినపల్లి బాగ్యలక్ష్మి, బోయినపల్లి నాగేంద్ర, చేబ్రోలు కృష్ణవేణి, బోయినపల్లి భూలక్ష్మి, వత్సవాయి నాగమణి, యర్రగాని నాగరాణితో పాటు విద్యార్థులు బందం జ్యోత్స్న, బోయినపల్లి అఖిల్, బంధం హర్షవర్ధన్, నిహారిక, ప్రవళికలకు గాయాలయ్యాయి. ఆదివారం సెలవు కావడంతో పని ప్రాంతానికి తల్లిదండ్రులు వెంట విద్యార్థులు వెళ్లినట్లు తెలిసింది. మూడు సంవత్సరాల వయస్సున్న చిన్నారి ధనుష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలైన 11మందిని 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన ద్విచక్రవాహనదారుడు వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు. ఈ ఘటనలో ఆర్వోబీ సైడ్‌వాల్ నుంచి ట్రాక్టర్ ట్రక్కు సర్వీసు రోడ్డుపై పడి ఉంటే భారీ ప్రాణనష్టం జరిగి ఉండేది.



గాయపడిన బాలిక



ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్వర్లు

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాలి

నేలకొండపల్లి, ఫిబ్రవరి4: ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం. నేలకొండపల్లిలో జీవీ నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన యూటీఎఫ్ జిల్లా విస్తృతస్థాయి సమావేశాల్లో నర్సిరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సమావేశంలో నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సర్వేక్షణాధికారుల పోస్టులు 80శాతం పైనే ఖాళీగా ఉన్నాయని, వాటితో పాటుగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కేంద్రం లో అధికారంలో ఉన్న పాలకులు రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తూ, మతాన్ని రాజకీయ లబ్ధి పొందటానికి వాడుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. జాతీయ విద్యా విధానం-2020 రద్దు చేయాలని నర్సిరెడ్డి డిమాండ్ చేసారు.

సమస్యలపై దృష్టి సారించాలి
యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి

నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్య, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి కోరారు. ఆదివారం నేలకొండపల్లిలో జరిగిన యూటీఎఫ్ జిల్లా విస్తృత స్థాయి సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత 9సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావులతో పాటుగా రావెళ్ళ అరవింద్‌కుమార్, తొర్తి గురవయ్య, పి.సురేష్, విజయ్‌కుమార్, మంగేశ్వరి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శులు నెల్లూరి వీరబాబు, రాజశేఖర్, బుర్రి వెంకన్న, నాగూర్‌వలీ, జియావుద్దీన్, నాగేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

దాడులు చేసిన వారిపై కేసుల నమోదు

ఖమ్మం క్రైం/ ఖమ్మం రూరల్, ఫిబ్రవరి4: ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం అర్ధరాత్రి విచక్షణ రహితంగా దాడులు చేసిన వారిపై ఆదివారం రాత్రి ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. అడ్డు వచ్చిన పోలీసు అధికారిపై కూడా దాడి చేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రూరల్ మండలం తెల్దారుపల్లికి చెందిన వారికి నగరం లోని రేవతి సెంటర్ కు చెందిన వారికి శనివారం రాత్రి ఓ దాబాలో ఘర్షణ జరిగింది. ఈఘర్షణలో గాయపడిన ఇనుప రాంబాబును జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అదే సమయంలో గాయపడిన వ్యక్తిని పరామర్శించేందుకు తెల్దారుపల్లికి చెందిన వినోద్, మహేశ్, కాళిచరణ్, సాయి, గోవర్ధన్, ఉదయ్ ప్రభుత్వ ఆసుపత్రికి వద్దకు వెళ్లారు. తిరిగి బయటకు వస్తుండగా వారిపై ఖమ్మం రేవతి సెంటర్ కు చెందిన కొంతమంది యువకులు రాళ్లు, కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో వినోద్, మహేశ్, కాళీ చరణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన వారంతా భయంతో అక్కడి నుంచి పారిపోయారు. అదే సమయంలో అడ్డుకోబోయిన రూరల్ ఎస్సై సురేష్ పై కూడా దాడి చేశారు. ఈఘటనపై వినోద్‌తో పాటు రూరల్ ఎస్సై సురేష్ కూడా ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. కాగా ఈ కేసులో నిందితులైన 12 మంది పోలీసుల అదుపులో ఉండగా.. వారిని వివిధ పోలీస్ స్టేషన్లలో ఉంచి విచారణ చేస్తునట్టు తెలిసింది.

ప్రభుత్వ ఆసుపత్రికి సీపీ

ఘటన జరిగిన తరువాత విషయం తెలిసిన సీపీ సునీల్ దత్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఘటన జరిగిన తీరును, వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు గంటకు పైగా ఘర్షణ జరగడంతో సివిల్ దుస్తులలో ద్విచక్రవాహనం పై సామాన్య వ్యక్తిలా వచ్చి ఘర్షణకు పాల్పడిన వారి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్టు తెలిసింది.



దాడిలో గాయపడిన రూరల్ ఎస్సై సురేష్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 4: మండలంలోని బుచ్చన్నగూడెంలో ఓ వ్యక్తి పురుగులమందు తాగి మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన తోడేటి రామలింగయ్య(33) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఒత్తిడికి గురయ్యాడు. శనివారం రాత్రి పని మీద బయటికి వెళ్లిన లింగయ్య ఎంతకీ ఇంటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్ చేస్తే ఎత్తలేదు. ఆదివారం ఉదయం 11గంటల సమయంలో తోట కాపరి గ్రామసమీపంలో తిరుగుతుండగా రామలింగయ్య మృతదేహన్ని చూశాడు. ఈసమాచారాన్ని మృతిడి కుటంబానికి, యజమానికి సమాచారం అందించాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

వివాహిత అదృశ్యం

కామేపల్లి, ఫిబ్రవరి 4: కామేపల్లి మండల పరిధిలోని పింజరమడు గుతండకు చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. గ్రామానికి చెందిన ఓ వివాహిత రెండు రోజుల క్రితం ఇంట్లో చిన్న తగాదా కావడంతో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. రెండు రోజులుగా భర్త ఆమె ఆచూకీ కోసం బంధువులు, స్నేహితులను సంప్రదించినా ఉపయోగం లేకుండా పోయింది దీంతో వివాహిత భర్త శ్రీను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కోటమైసమ్మ ఆలయ విరాళాలపై

విచారణ చేపట్టండి

దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్‌కు సామాజిక కార్యకర్త ఫిర్యాదు

కామేపల్లి, ఫిబ్రవరి 4: కొత్తలింగాల కోటమైసమ్మ ఆలయ పునర్నిర్మాణానికి దాతలు ఇచ్చిన విరాళాలపై విచారణ చేపట్టాలని సింగరేణికి చెందిన సామాజిక కార్యకర్త వాసిరెడ్డి సంపత్‌కుమార్ ఖమ్మం దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అమ్మవారి భక్తుడైన దిరిశాల నరేష్‌చౌదరి దేవాలయ పునర్నిర్మాణం కోసం రూ.5లక్షలు చెక్‌ను గత ఏడాది మే23న ఆలయంలో అందజేశారు. ఆ చెక్‌ను ఆలయ చైర్మన్ మల్లెంపాటి శ్రీనివాసరావు నిబంధనలకు విరుద్ధంగా చెక్‌ను దేవాదాయ శాఖ బ్యాంక్ ఖాతాలో జమ చేయకుండా, సొంతానికి ఉపయోగించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ నగదును రికవరీ చేసి కోటమైసమ్మ బ్యాంక్ ఖాతాలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్‌ను కోరాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి4: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందారు. ఈసంఘటన ఆదివారం మండలంలో జరిగింది. మండలంలోని ఇస్లావత్ తండాకు చెందిన ఇస్లావత్ బాలాజీ(52) వ్యవసాయం సాగుచేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల రెండో తేదీన కడుపునొప్పి తాళలేక పురుగుమందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంలోని మమత ఆసుపత్రికి చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులున్నారు. కాగా ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ శ్రీనివాస్ తెలిపారు.


మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి

ఐఎన్‌టీయూసీ నాయకుడి దరఖాస్తు

కామేపల్లి, ఫిబ్రవరి 4: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి మండల పరిధిలోని గోవింద్రాలకు చెందిన ఐఎన్‌టీయూసీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ విశ్రాంత ఉద్యోగి బానోత్ లక్ష్మణ్ నాయక్ గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి అనుబంధ సంఘంగా ఉన్న ఐఎన్‌టీయూసీలో కీలక నేతగా పని చేశారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విజయానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో చీమల వెంకటేశ్వర్లు, మాలోత్ ప్రేమ్ ఉన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

కొణిజర్ల, ఫిబ్రవరి 4: కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ భూక్యా లోక్‌చంద్(46) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకారం కారేపల్లి మండలం సూర్యతండాకు చెందిన లోక్‌చంద్ రెండు సంవత్సరాలు నుంచి కొణిజర్లలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అనారోగ్యానికి గురయి రెండు నెలలుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అతడి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. లోక్‌చంద్ మృతి పట్ల తోటి కానిస్టేబుళ్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



లోక్‌చంద్(ఫైల్)

భద్రాద్రి రామయ్యకు అభిషేకం, స్వర్ణపుష్పార్చన

భద్రాచలం, ఫిబ్రవరి 4: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి ఆదివారం సందర్భంగా ఆర్జిత సేవల్లో భాగంగా అంతరాలయంలో మూలవరులకు ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని ఏపీలోని అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు స్వామి వారి ప్రత్యేక అభిషేక సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు సాయిబాబా, ఈఈ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.


రామాలయంలో అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్రమోహన్

శ్రీవారి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఎర్రుపాలెం ఫిబ్రవరి 4: మండలంలో జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి దాత ఆదివారం విరాళాన్ని అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు పట్టణానికి చెందిన మాచవరపు గౌరీశంకరి శ్రీవారి నిత్య శాశ్వత అన్నదానం నిర్వహించేందుకు రూ.లక్ష చెక్కును ఆలయ సూపరింటెండెంట్ కె. విజయ కుమారికి అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ప్రత్యేక పూజలు చేయించి, వేద ఆశీర్వచనము చేసి శేష వస్త్రములు, తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది సోమయ్య, కృష్ణప్రసాద్, సాయి, వంశీ, విజయ్ మస్తాన్ పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న దాత

సులువుగా జీవన్ ప్రమాణ్ పత్రం



- టీ యాప్ ఫోలియోలో వివరాలతో మరింత సులువు
- కార్యాలయాలకు వెళ్లకుండానే ధ్రువీకరణ
- పింఛన్‌దారులకు అందుబాటులోకి వచ్చిన ప్రత్యేక అప్లికేషన్



ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 4: విశ్రాంత ఉద్యోగులు, పింఛనుదారులు తాము జీవించి ఉన్నట్లు జీవన ప్రమాణపత్రాన్ని ప్రతీ సంవత్సరం అందించాల్సి ఉంటుంది. అయితే వయస్సు మీద పడిన వారు, మంచానికే పరిమితం అయిన వారు, దివ్యాంగులు ఏడాదిలో ఎప్పుడైనా సమర్పించేలా వెసులుబాటు కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర ఖజానాశాఖ ప్రత్యేకంగా డిజిటల్ జీవన ప్రమాణపత్రం సమర్పించడానికి ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. తమ పత్రాలను టీ యాప్ ఫోలియో ద్వారా వివరాలను అందించడానికి అవకాశం కల్పించింది. పీఎఫ్ కార్యాలయాలకు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో సేవలను సద్వినియోగం చేసుకునేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. దీనితో పాటు తపాలాశాఖ కార్యాలయాల్లోనూ, మీసేవా కేంద్రాల్లో కూడా ఈ యాప్ ద్వారా వారి వివరాలను పంపించవచ్చు. మీ చేతిలో ఫోన్ ఉంటే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సులువుగా జీవన్ ప్రమాణ్ పత్రాన్ని పంపించవచ్చు.


టీ యాప్ ఫోలియో యాప్

సెల్‌ఫోన్ ద్వారా..

ఈపీఎఫ్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు పదవీవిరమణ తరువాత ప్రతినెల పింఛను పొందే విషయం తెలిసిందే. ఖమ్మం జిల్లాలో సుమారు 12,650 మంది విశ్రాంత ఉద్యోగులున్నారు. వీరంతా ఏటా పించన్ పొందాలంటే డిసెంబరు నుంచి ఫిబ్రవరి నెలాఖరు నాటికి తాము జీవించి ఉన్నట్లు జీవన్ ప్రమాణ్ పత్రాన్ని అందించాలి. అయితే వయసు మీద పడినవారు, దివ్యాంగులు ధ్రువపత్రాలు, వేలిముద్రలు సమర్పించడానికి ఈపీఎఫ్వో కార్యాలయానికి వెళ్లడం కష్టంగా మారింది. ఈ సమస్యను అధిగమించడానికి ఏడాదిలో ఎప్పుడైనా సమర్పించేలా వెసులుబాటు కల్పించింది. వయోభారంతో ఉన్నవారు సమీప తపాలా కార్యాలయాలకు, మీసేవలకు వెళ్లి నమోదు చేసుకోవాల్సి వస్తోంది. అయితే తపాలాకార్యాలయాల్లో మాత్రం సమాచారమిస్తే సిబ్బంది ఇంటికే వచ్చి వేలిముద్రలు తీసుకుని జీవన్ ప్రమాణ్ పత్రాన్ని జారీ చేస్తున్నారు. దీనికిగాను కేవలం రూ.70 చెల్లిస్తే సరిపోతుంది. వృద్ధులు, దివ్యాంగులు ఆన్‌లైన్, తపాలా కార్యాలయాలు, బ్యాంకుల ద్వారా పత్రాన్ని సమర్పించవచ్చు. మీసెల్ ఫోన్‌లో 'టీ యాప్ ఫోలియో' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దానిలో సెల్‌నెంబరును నమోదు చేసుకుని ముందుగా ఐడీనెంబర్‌తో వివరాలను నిక్షిప్తం చేయాలి. ఆ తర్వాత విశ్రాంత ఉద్యోగి ఫొటోను అప్‌లోడ్ చేసి పత్రాలన్నీ కార్యాలయానికి పంపించవచ్చు.

సులువైన మార్గం.. సద్వినియోగించుకోవాలి
వి. సత్యనారాయణ, ఖజానాశాఖ అధికారి, ఖమ్మం



పింఛను కోసం ఏటా డిసెంబరు నుంచి ఫిబ్రవరి నెలాఖరులోగా జీవన ప్రమాణపత్రం ఇవ్వాలి. అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడేవారు తపాలాశాఖ, మీసేవలో జీవన్ పత్రాన్ని అందించుకోవచ్చు. నేరుగా కార్యాలయానికి కూడా వచ్చి ఇవ్వొచ్చు. కార్యాలయానికి రాలేని వారు సెల్‌ఫోన్‌లో టీ యాప్ పోల్ ద్వారా కూడా వివరాలు పంపించవచ్చు. ఇది విశ్రాంత ఉద్యోగులకు, వృద్ధాప్య పింఛను పొందేవారికి సౌలభ్యంగా ఉంటుంది.

తప్పుల తిప్పలు!



- జనన, మరణ ధృవీకరణ పత్రాల్లో అక్షర దోషాలు
- మార్చటం కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

ఖమ్మం కార్పొరేషన్, ఫిబ్రవరి4: ఖమ్మం నగరానికి చెందిన వినయ్‌కుమార్ అనే వ్యక్తి తన కుమారుడి జనన ధ్రువీకరణ పత్రం పత్రం నగరపాలకసంస్థ కార్యాలయం ద్వారా తీసుకున్నారు. అయితే సర్టిఫికెట్‌లో అతడిపేరు విజయ్‌కుమార్‌గా నమోదు చేశారు. దీంతో పేరు మార్పు కోసం వినయ్‌కుమార్ నగరపాలకసంస్థ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అలాగే ఒక మహిళ పేరులోని ఒక అక్షరం లేకుండా మరణ ధ్రువీకరణ పత్రం ఇవ్వటంతో ఆమె కుటుంబసభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా జనన, మరణ ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు దొర్లటంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పులను సరిదిద్దటం కోసం నగరపాలకసంస్థ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఒకసారి పేరు పూర్తిగా తప్పుగా వస్తే దానిని మార్చటం కుదరదని అధికారులు చెప్పటంతో ఆందోళన పడుతున్నారు. ఒక అక్షరం తప్పుపడితే దానిని సరిచేయడానికి నానా తిప్పలు పడుతున్నారు. నోటరీ చేయించాలని, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు తేవాలని, గెజిటెడ్ అధికారుల ధ్రువీకరణ కావాలని, ఇలా సవాలక్ష నిబంధనలను పెట్టి దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కాగా పేర్ల నమోదు విషయంలో కంప్యూటర్ ఆపరేటర్లు చేసిన తప్పులకు తామెలా బాధ్యులం అవుతామని దరఖాస్తుదారులు గగ్గోలు పెడుతున్నారు.

ఆసుపత్రులకు లాగిన్ ఇవ్వటంతో..

జనన ధ్రువీకరణ పత్రాల నమోదుకోసం ఆస్పత్రులకు లాగిన్‌లు ఇవ్వటంతో అక్కడి కంప్యూటర్ ఆపరేటర్లు తప్పులుగా నమోదు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకోసం నగరపాలకసంస్థ కార్యాలయం చుట్టూ తిరిగే పని లేకుండా వెంటనే వచ్చేందుకు ప్రభుత్వ ఆసుపత్రితో సహా అన్ని ఆసుపత్రులకు జనన ధ్రువీకరణ పత్రాలు నమోదు చేసేందుకు గత ప్రభుత్వం లాగిన్‌లు ఇచ్చింది. మరణ ధ్రువీకరణ పత్రం కోసం శ్మశానవాటికలోనే ఒక ఉద్యోగిని నియమించారు. అతడు ధ్రువీకరణ పత్రాలు నమోదు చేస్తాడు. అనంతరం హార్డ్‌కాపీలను నగరపాలకసంస్థ కార్యాలయానికి పంపుతారు. వాటిని కమిషనర్ అప్రూవ్ చేసిన అనంతరం జనన,మరణ ధ్రువపత్రాలు మీసేవా ద్వారా జారీ అవుతాయి ఇలా సులభతరంగా జనన,మరణ సర్టిఫికెట్లు వస్తున్నప్పటికీ కంప్యూటర్ ఆపరేటర్లు నిర్లక్ష్యంతో చేసే తప్పులకు దరఖాస్తుదారులు బలవుతున్నారు. పేరు తప్పుగా పడితే దానిని సరిచేసే లాగిన్ నగరపాలకసంస్థ కమిషనర్ వద్ద ఉండటంతో, దరఖాస్తుదారులు నగరపాలకసంస్థ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

కంప్యూటర్ ఆపరేటర్లకు అవగాహన కల్పిస్తున్నాం
వాసుదేవరావు, ఏఎస్‌వో

నగరపాలకసంస్థ కార్యాలయంలో వివిధ ఆసుపత్రులకు చెందిన కంప్యూటర్ ఆపరేటర్లకు నెలలో మూడుసార్లు సమావేశం నిర్వహించి పేర్లు తప్పుగా నమోదు చేయవద్దని చెబుతున్నాం. వచ్చిన దరఖాస్తునుకు క్షుణ్ణంగా పరిశీలించి, దరఖాస్తులో ఉన్న పేరును సరిగా నమోదు చేయాలని అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం తప్పుగా పడిన పేర్లను సరిచేసే లాగిన్ మాత్రమే నగరపాలకసంస్థ కార్యాలయంలో ఉంది.

ముద్దాయిల వయసు పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా జైలు తనిఖీలో న్యాయాధికారి జావీద్‌పాషా

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 4: ఏదేని వ్యక్తిని నేరారోపణపై అరెస్టుచేసి జైలుకు పంపించేటప్పుడు ఆ వ్యక్తి వయసు నిర్ధారణ విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ప్రధాన సీనియర్ సివిల్ న్యాయాధికారి, న్యాయసేవాసంస్థ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా అన్నారు. ఆదివారం న్యాయాధికారి దానవాయిగూడెంలోని జిల్లా జైలును సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి విచారణ ముద్దాయిలు, జైలు శిక్ష అనుభవిస్తున్న వారి వయస్సు గురించి ఆరా తీశారు. జాతీయ న్యాయసేవాధికారసంస్థ ఆదేశాల మేరకు జైల్లో ఉంటున్నవారు బాలలా, పెద్దవారా అని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతీ ముద్దాయిని వారు నేరానికి పాల్పడ్డారని ఆరోపిస్తున్న సమయంలో జువనైల్‌గా ఉన్నారా లేరా అనే అంశాన్ని వారి ద్వారానే తెలుసుకుంటున్నారు. న్యాయాధికారి పర్యటన సందర్భంగా మహిళా ఖైదీల బ్యారక్‌లో ఒక ముద్దాయి తన వయసు 17 ఏళ్లు అని తెలపటంతో విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని జైలు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జైలు సిబ్బంది సక్రు నాయక్, మోహన్‌రావు, సుబ్రహ్మణ్యం, దుర్గ పాల్గొన్నారు.


మహిళా ముద్దాయితో మాట్లాడుతున్న న్యాయాధికారి

న్యాయవాదుల వనసమారాధన

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 4: ఖమ్మం నగరంలోని చెరుకూరి వారి మామిడితోటలో ఆదివారం న్యాయవాదుల వనసమారాధన ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు ఆధ్వర్యంలో ఉల్లాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారి బీఎస్ జగ్జీవన్‌కుమార్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు తమ పని వత్తిడిని మరిచిపోవటానికి ఈ వనసమారాధన వేడుకలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాదిరాజు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి బసవయ్య, ఎంజే ప్రవీణ్‌కుమార్, అమర్‌నాథ్, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.


చిన్నారుల నృత్య ప్రదర్శన

సమ్మక్కసారక్కలను దర్శించుకున్న ఎమ్మెల్యే


అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా/ ఏన్కూరు, ఫిబ్రవరి 4: తెలంగాణ కుంభమేళగా పిలిచే మేడారంలో సమ్మక్క సారక్క గద్దెలను ఆదివారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏన్కూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్ర, కారేపల్లి సొసైటీ అధ్యక్షుడు దుగ్గిని శ్రీనివాసరావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పగడాల మంజుల పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసం

- దుండగుల దాడిలో విరిగిన చేయి

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 4: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, పోలేపల్లి పరిధిలోని రాజీవ్ గృహకల్పలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. రాజీవ్‌గృహకల్ప కాలనీలో ఎన్టీఆర్ విగ్రహన్ని సుమారు పదేండ్లక్రితం టీడీపీ నాయకులు ఏర్పాటు చేశారు. శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు విగ్రహం ఎడమచేతిని విరగగొట్టారు. మండలంలోని టీడీపీ నాయకులు విగ్రహం చేతిని విరగగొట్టిన దుండగలను గుర్తించే పనిలో ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు టీడీపీ నాయకులు సిద్ధం అయ్యారు. టీడీపీ నాయకుడు నల్లమల రంజిత్, బీఆర్ఎస్ నాయకుడు చింతనిప్పు కృష్ణ చైతన్య ఈ ఘటనను ఖండించారు.


ధ్వంసమైన విగ్రహం

వంతెన కల సాకారం

- రాకాసితండా బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి
- మాట నిలబెట్టుకున్న మంత్రి తుమ్మల
- రాకాసితండా ప్రజల అభినందనలు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి4: మండలంలోని రాకాసి తండా ప్రజల దశాబ్దాల కల సాకారం నెరవేరనుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్లుభవనాల శాఖ మంత్రి ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారు. రాకాసితండా ప్రజలకు ఇచ్చిన హామీమేరకు ఆతండాకు బ్రిడ్జి నిర్మాణంతో పాటు బీటీ రోడ్లు నిర్మాణ పనులకు నిధులు మంజూరుచేశారు. ప్రస్తుతం బీటీ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో రాకాసితండా గ్రామస్థులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మండలంలోని జిల్లాసరిహద్దులో ఉన్న మారుమూల ప్రాంతమైన రాకాసితండా గ్రామస్థులు బ్రిడ్జి నిర్మాణం కోసం దశాబ్దాల కాలం నుంచి వేచిచూస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో ప్రభుత్వాలు ఎందరో ప్రజాప్రతినిధులు మారినా వంతెన నిర్మాణ పనులు చేయలేదు. దీంతో ఆతండా వాసులకు బ్రిడ్జి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏ ఆపద వచ్చినా తీసుకెళ్లాలంటే నరకయాతన పడేవారు. వర్షాకాలంలో ఆకేరు ఉధృతంగా ప్రవహిస్తే ఆతండా వాసులకు రాకపోకలు నిలిచిపోతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు రాకాసితండాకు ఆకేరు నదిపై బ్రిడ్జి నిర్మాణంతోపాటు చెక్‌డ్యాం, బీటీ రోడ్డు నిర్మాణ పనులకు సుమారు రూ.15 కోట్లు నిధుల మంజూరుచేశారు. ఆపనులు చివరిదశలో ఉండగా ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.


ఆకేరు నదిపై రాకాసితండా వద్ద నిర్మించిన బ్రిడ్జి

కవిత్వ పుస్తక ఆవిష్కరణ


చెమటపూల తోట కవితా సంపుటి ఆవిష్కరణ దృశ్యం

ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 4: కవి, గేయ రచయిత రౌతు రవి రచించిన చెమటపూల తోట కవిత్వ సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం ఖమ్మంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ఫ్రీవర్స్‌ఫ్రంట్ అవార్డు గ్రహీత ఇబ్రహీం నిర్గున్ స్వాగతం పలికిన ఈసభకు అభ్యుదయ గాయకుడు మేడగాని శేషగిరి అధ్యక్షత వహించారు. ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు, విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, ప్రముఖ కవులు సిరికి స్వామి నాయుడు, గోపగాని రవీందర్, కథా రచయిత శిరం శెట్టి కాంతారావు, షకూర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ గజల్ కవి గాయకుడు కన్నెగంటి వెంకటయ్య పుస్తకాన్ని సభికులకు పరిచయం చేశారు. ప్రజా గాయకులు జగన్, నాగన్న, పాగి వెంకన్న, ఆసుప్రసాద్, స్వప్న పాల్గొన్నారు. రౌతు రవి కవిత్వం పీడిత ప్రజల పక్షమని వక్తలు కొనియాడారు.

మతిస్థిమితం లేని వ్యక్తిపై దాడి


బాధితుణ్ని అన్నం ఫౌండేషన్‌లో అప్పగిస్తున్న పోలీసులు

చింతకాని, ఫిబ్రవరి 4: మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిని దొంగగా భావించి అతడిపై దాడి చేసిన ఘటన చింతకాని మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. చింతకాని మండలంలో రెండు జాతీయ రహదారుల నిర్మాణంతో పాటు రైల్వే మూడో లైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఒడిషా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన అనేక మంది కార్మికులు పనులు చేస్తున్నారు. ఇటీవల చిన్న పిల్లలను అపహరించి విక్రయిస్తున్న ముఠాలపై స్థానికులు దాడులు చేస్తున్న వీడియోలను పలువురు సోషల్ మీడియా గ్రూప్‌లలో ఫార్వర్డ్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న పిల్లల దొంగ ఇతనే అని వదంతులు సృష్టించి నాగులవంచ గ్రామానికి చెందిన కొందరు యువకులు ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన మతి స్థిమితం కోల్పోయిన వ్యక్తిపై శనివారం అర్ధరాత్రి దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అపస్మారక స్థితిలో ఉన్న మతి స్థిమితం కోల్పోయిన వ్యక్తిని పోలీసులు స్టేషన్‌కు తరలించి అనంతరం అన్నం సేవాసమితి ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అన్నం సేవా సమితి ఛైర్మన్ అన్నం శ్రీనివాసరావు మతిస్థిమితం లేని వ్యక్తిని వైద్య పరీక్షల అనంతరం సేవాసమితిలో చేర్పించారు. ఇలాంటి ఘటనలు మండలంలో వరుసగా మూడు సార్లు జరగటం గమనార్హం. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను చూసి ప్రజలు అపోహలకు గురికావద్దని అపరిచితులు, అనుమానితులు గ్రామాల్లో తిరుగుతుంటే పోలీసులకు సమాచారమివ్వాలని ఎస్‌ఐ ఆలకుంట రాజేందర్ సూచించారు.

నెగ్గేనా.. తగ్గేనా?

- ఇల్లెందు మునిసిపల్ ఛైర్మన్ డీవీపై నేడు అవిశ్వాస ఓటింగ్
- తీర్మానం నెగ్గేందుకు మ్యాజిక్ ఫిగర్ 17
- ఊగిసలాటలో జంప్‌జిలానీలు

ఇల్లెందు, ఫిబ్రవరి 4: ఇల్లెందు మునిసిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావుపై 19మంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు అందజేసిన అవిశ్వాస తీర్మానంపై సోమవారం జరగనున్న ప్రత్యేక సమావేశంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావును పదవి నుంచి తొలగించడానికి బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లే తీవ్ర యత్నాలు చేస్తుండడం గమనార్హం.. ఈ క్రమంలో రెండుసార్లు అవిశ్వాస తీర్మానాలు అందించడం, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వాటిపై చర్చ వాయిదా పడిన విషయం తెలిసిందే.. అయితే అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన అనంతరం గత నెలలో 19మంది కౌన్సిలర్లు ఫారం-1 ద్వారా భద్రాద్రి కలెక్టర్ ప్రియాంకకు మరోసారి డీవీపై అవిశ్వాస తీర్మానం అందజేయడంతో నిబంధనల మేరకు సోమవారం దీనిపై ఓటింగ్ సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఛైర్మన్ డీవీపై ప్రకటించిన అవిశ్వాసం నెగ్గుతుందా.. లేదా ? అనేది ఉత్కంఠంగా మారింది. గత నెలలో కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం అందజేసిన మరుసటి రోజునే అవిశ్వాస కౌన్సిలర్లంతా రహస్య క్యాంపునకు తరలివెళ్లారు. ఈ అవిశ్వాసంతో ఛైర్మన్ పదవి ఆశిస్తున్న కౌన్సిలర్ సరిత భర్త కొండపల్లి గణేష్ నాయకత్వంలో అవిశ్వాస కౌన్సిలర్లు గత 15రోజులుగా క్యాంపులోనే ఉంటున్నారు. వారంతా సోమవారం ఓటింగ్ వేళకు ఇల్లెందు మునిసిపల్ కార్యాలయానికి చెరుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

జంప్ జలానీలపై కన్నేసిన నేతలు

అవిశ్వాస ప్రక్రియకు నాంది పలికి డీవీకి వ్యతిరేకంగా కౌన్సిలర్లను ఏకం చేసిన వైస్ ఛైర్మన్ జానీ పాషతో పాటుతో అవిశ్వాస తీర్మానంపై సంతకం చేసిన పలువురు కౌన్సిలర్లు ఆఖరి క్షణంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఉత్కంఠ నెలకొంది. క్యాంపులో ఉన్న వారిని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కాంగ్రెస్ అగ్రనేతలు తీవ్ర స్థాయిలో యత్నాలు చేశారు. కబ్జాల ఆరోపణలపై పోలీసు ఫిర్యాదులు ఉన్నవారిని తమ శిబిరానికి తెచ్చుకునే యత్నాలు జోరుగానే చేయడంతో అవిశ్వాస శిబిరానికి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు ఛైర్మన్ డీవీకి అనుకూలంగా వ్యవహరించడానికి నిర్ణయించుకున్నట్లు చర్చ జరుగుతోంది. ఇప్పటికే అవిశ్వాసంపై సంతకాలు చేసిన వైస్ ఛైర్మన్ జానీ పాష, కౌన్సిలర్ పత్తి స్వప్న, మరో మహిళ కౌన్సిలర్ భర్త స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి ఎమ్మెల్యే కోరం కనకయ్య ద్వారా చర్చలు జరిపినట్లు తెలిసింది. ఈ ముగ్గురు అవిశ్వాస ఓటింగ్‌లో ఛైర్మన్ డీవీకి అనుకూలంగా వ్యవహరిస్తారని ప్రచారం జరుగుతోంది. ఫలితంగా ఛైర్మన్ డీవీ శిబిరంలో కౌన్సిలర్ల సంఖ్య ఏడుకు చేరుకుంది.


మంత్రి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఛైర్మన్ వెంకటేశ్వరరావు(ఫైల్)

ప్రత్యార్థి శిబిరంలో ఆదివారం సాయంత్రం వరకు 17మంది కౌన్సిలర్లు ఉన్నా సోమవారం ఓటింగ్ వేళకు ఎలాంటి పరిణామాలు జరుగుతాయోనని పొలిటికల్ సర్కిళ్లల్లో చర్చ జరుగుతోంది.

వ్యూహ ప్రతివ్యూహాల్లో ఇరు వర్గాలు

ఇల్లెందు మునిసిపాలిటీలో మొత్తం 24మంది కౌన్సిలర్లు ఉండగా మారిన నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 17మంది అనుకూలంగా ఓటు వేయాల్సి ఉంది. మునిసిపాలిటీలో బీఆర్ఎస్ నుంచి 19మంది, బీఆర్ఎస్ రెబెల్స్‌గా ముగ్గురు, సీపీఐ, న్యూడెమోక్రసీ పార్టీల నుంచి ఒకొక్కరు కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. వీరిలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఛైర్మన్ డీవీతో పాటు మరో ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, రెబల్‌గా గెలుపొందిన ఒకరు కాంగ్రెస్‌లో చేరారు. అయితే తాజాగా ఉత్పన్నమైన అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో డీవీ వర్గంలోకి ఏడుగురు కౌన్సిలర్లు ఉన్నట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే కోరం కనకయ్య ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా నమోదు కావడంతో కౌన్సిల్‌లో మొత్తం 25 సభ్యులు అవిశ్వాస ఓటింగ్‌లో పాల్గొనేందుకు అర్హులుగా ఉన్నారు. ఫలితంగా కోరం కనకయ్యతో పాటు మరో ఏడుగురు కౌన్సిలర్లతో డీవీకి అనుకూలంగా 8మంది ఉన్నారు. అయితే అవిశ్వాసంపై ఓటింగ్ జరగలంటే 2/3వంతు సభ్యులు సమావేశానికి హజరు కావాల్సి ఉంది. అంటే 17మంది సభ్యులు సమావేశంలో పాల్గొంటేనే అవిశ్వాసంపై ఓటింగ్ జరుగుతుంది. అంతేగాకుండా ఓటింగ్‌లో సైతం మొత్తం సభ్యుల్లో 2/3వంతు సభ్యులు అంటే మొత్తం 25మందిలో 17మంది అనుకూలంగా బలపరిస్తేనే అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ వ్యూహరచనల్లో నిమగ్నమయ్యాయి. కొండపల్లి గణేష్ శిబిరం నుంచి మరో కౌన్సిలర్‌ను లాగితే 9మంది కౌన్సిలర్లు ఛైర్మన్ డీవీకి అనుకూలంగా సమావేశానికి గైర్హాజరైతే కోరం లేకపోవడంతో సమావేశం వాయిదా పడి డీవీని గట్టెక్కించే ప్రయత్నాలు ముమ్మారంగా సాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా ఈ అవిశ్వాస సమావేశం సాఫీగా జరిగేందుకు ఆదివారం మున్సిపల్ కార్యాలయాన్ని పోలీసు అధికారులు పరిశీలించారు. శాంతి భద్రతాల సమస్య తలెత్తకుండా చేపట్టే చర్యలపై మునిసిపల్ అధికారులతో సమీక్షించారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న పాలకులు

జూలూరుపాడు, ఫిబ్రవరి 4: ప్రభుత్వ విద్యారంగాన్ని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని, వారి అవలంబిస్తున్న విధానాలతో పేదలకు విద్య అందని ద్రాక్షలా మారుతోందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ ఆరోపించారు. ఆదివారం జూలూరుపాడు ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో విద్యార్థులు నిత్యం సమస్యలతో సహవాసం చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.7800 కోట్ల ఉపకార వేతనాలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర పోస్టులను భర్తీ చేయాలని, సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడతామని తెలిపారు.

భవనాలు నిర్మించారు.. ఆచరణ మరిచారు..

ఆచరణలోకి రాని పశువుల వ్యాధి నిర్ధరణ కేంద్రం, రైతు శిక్షణ కేంద్రం

లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు వృథా

అశ్వారావుపేట, ఫిబ్రవరి 4: ఇప్పటికి అనేక ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు లేక పోవడం, ఉన్నభవనాలు అరకొరగా ఉన్న సంఘటనలు అనేకం కనిపిస్తుంటాయి. నిధులు లేమితోనో ఇతరత్రా కారణాలతో ఈ విధంగా జరుగుతుంటాయి. భవనాలు లేక అద్దె భవనాల్లో ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలు నడుస్తుంటాయి. ఇదంతా మామూలే. కాని అశ్వారావుపేట పశుసంవర్ధక శాఖలో ఇందుకు భిన్నమైన దృశ్యాలు కనిపిస్తున్నాయి. పశు సంపద ఎక్కువగ ఉన్న అశ్వారావుపేట ప్రాంతంలో పశువులకు తగిన వైద్య సౌకర్యాలు కల్పించేందుకు, రైతులకు పశు పోషణ, ఇతర అవసరాలపై శిక్షణ, నైపుణ్యతను పెంపొందించేందుకు 2014లో నియోజవర్గ స్థాయి మినీ వ్యాధి నిర్ధారణ కేంద్రం, పశువులను పెంచే రైతులకు శిక్షణ కేంద్రాలను మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ మేరకు రూ.10లక్షలు నాబార్డ్ నిధులతో నియోజకవర్గ స్థాయి మినీ వ్యాధి నిర్ధారణ కేంద్రం, రూ.60లక్షలతో నియోజకవర్గ స్థాయి పశురైతు శిక్షణ కేంద్రాలకు భవనాలను మంజూరు చేసారు. ఆ మేరకు భవనాలను పూర్తి చేసారు. 2017లో ప్రారంభోత్సవాలు కూడ చేసారు. ఆ తరువాత పశుసంవర్ధక శాఖ ఏ ఉద్దేశ్యంతో భవనాలను నిర్మించారో వాటిని ఇక్కడ ఏర్పాటు చేయడం మరిచారు. దీంతో ప్రభుత్వం పశువులు, వాటిని పెంచే రైతులకు శిక్షణ ఇవ్వాలనే సదుద్దేశ్యం నెరవేరకుండా పోయింది. లక్షలాది రూపాయలు వెచ్చించి భవనాలను నిర్మించిన ఆ శాఖ వ్యాధి నిర్ధారణ ల్యాబ్‌ను, వాటి సిబ్బందిని మంజూరి చేయడం మరిచి పోయింది. దీంతో ఆ భవనం వృథాగ పడి ఉంది. రైతు శిక్షణ కేంద్ర భవనం రూ.60 లక్షలతో నిర్మించారు కాని సంబంధిత కార్యకలాపాలు ఏమి నిర్వహించడం లేదు. దీంతో గత ఏడేళ్లుగా లక్షలు రూపాయలు వెచ్చించిన భవనాలు తాళాలు వేసి ఉన్నాయి. ప్రభుత్వ ఉద్దేశ్యం నెరవేరకుండానే ఆ భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఈ భవనాలు అసాంఘిక కార్యకలపాలకు, పాములు, తేళ్లకు నిలయంగా మారింది. ఇప్పటికైన ఈ భవనాలను వినియోగంలోకి తేవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.




వృథాగా పడి ఉన్న వ్యాధి నిర్ధరణ ప్రయోగశాల భవనం


రైతు శిక్షణ, విస్తరణ కేంద్రం

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ


అంతిమ యాత్రలో పాల్గొన్న సాత్విక

ఇల్లెందురూరల్, ఫిబ్రవరి 4: కన్న తండ్రికి తనే తలకొరివి పెట్టింది ఓ తనయ. ఇల్లెందు మండలం చల్లసముద్రం గ్రామపంచాయతీ ముకుం దాపురం గ్రామంలో శుక్రవారం గుండెపోటుతో మరణించిన బీఆర్‌ఎస్ నేత పేరుమళ్ల కృష్ణయ్యకు ముగ్గురు కుమార్తెలు ఉండడంతో 14 ఏళ్ల కుమార్తె సాత్విక అన్ని తానై తల కొరివి పెట్టింది. అంతకు మందు కృష్ణయ్య మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మాజీ జిల్లా గ్రంధాలయ ఛైర్మన్ దిండిగల రాజేందర్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ హరిసింగ్ నాయక్, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ బండారి శ్రీను, మాజీ జడ్పీటీసీ చంద్ర అరుణ, యాకుబ్ షావాలి, ఆర్, బోసు, రాంసింగ్, ఐలు నారాయణ, ఐలు శ్రీను, బింగి వెంకన్న, రామూర్తి, ఎంపీటీసీ పూనెం లింగమ్మ తదితర నేతలు పూల మాలాలు వేసి నివాళులు అర్పించారు.

నేడు ఇల్లెందులో 144 సెక్షన్

ఇల్లెందు, ఫిబ్రవరి 4: ఇల్లెందు మున్సిపాలిటిలో సోమవారం జరుగనున్న అవిశ్వాస బలపరీక్ష నేపథ్యంలో ఇల్లెందు పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఇల్లెందు సీఐ టి.కరుణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎటువంటి ర్యాలీలు, ధర్నాలు, నిర్వహించవద్దని, గుంపులుగా జనాలు గుమిగూడవద్దని తెలిపారు. రాజకీయ పార్టీ నేతలు విమర్శించుకోవద్దని సూచించారు. డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, తొమ్మిది మంది ఎస్ఐలతో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కావడిగుండ్ల వాసులు


కాంగ్రెస్‌లో చేరిన వారు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 4: అశ్వారావుపేట మండలం, కొత్త కావడిగుండ్లకు చెందిన సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథాకు చెందిన 20 కుటుంబాలవారు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జేస్ట సత్యనారాయణ చౌదరి సమక్షంలో వీరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ఉన్నప్పుడు కావడిగుండ్ల ప్రాంతంలో మేలు జరిగిందని, అందుకే తాము కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామన్నారు. పార్టీలో చేరిన వారిలో కొమరం రవి, సబ్కాగోపి, సబ్కా బాలు, ముయ్యబోయిన కృష్ణ, మడకం సురేష్, మడకం లోకేష్, సబ్కా సంతోష్, మడివి సోమరాజు, సోడెం పెద్దయ్య, పొడియం చిన్నయ్య, సోడియం చిన్న రమేష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి నాగేంద్రరావు, భూక్య ప్రసాద్, ఆకిరిపల్లి రాంబాబు, హలావత్ శ్రీను పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి దేస్థానంలో భక్తుల రద్దీ


క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులు

పాల్వంచ, ఫిబ్రవరి 4 : మండల పరిధిలోని కనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి)లో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ఇరు జిల్లాల నుంచి భక్తులు అనేకమంది తమ కుటుంబ సభ్యులతో కలసి దేవస్థానానికి తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని గోత్రనామార్చన, కుంకుమపూజ, వాహన పూజలు జరిపించుకుని తలనీలాల సమర్పణ, అన్నప్రాసన, ఒడిబియ్యం, చీరలు, కనుములు తదితర మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు, సారెలు సమర్పించుకుని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఈవో రజనీకుమారి ఆదేశాల మేరకు సిబ్బంది భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేసి ఉచిత పులిహోర వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు ఆచార్యులు, సందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింతానాగరాజు, బండి వెంకటేశ్వర్లు, గందం వెంగశరావు, మాలోతు సువాలి తదితరులు పాల్గొన్నారు.

పే స్కేల్ అమలు చేయాలి


ఐక్యత చాటుతున్న అవుట్ సోర్సింగ్ జేఏసీ నాయకులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 4: ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి రాష్ట్రంలో ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికి పే స్కేల్ వర్తింపచేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య కోరారు. ఆదివారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో వివిధ శాఖల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. అందులో భాగంగా ఈ నెల 6వ తేదీన అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సభను జిల్లాలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సభకు అన్ని విభాగాలలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. అనంతరం సమస్యలపై మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా కో-ఆర్డీనేటర్ దిలీప్, జిల్లా సభ్యులు కృష్ణ, బాలాజీ, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి


మొక్క నాటుతున్న జీఎం వెంకటేశ్వర్లు

చుంచుపల్లి, ఫిబ్రవరి 4: అంబేద్కర్, పూలే మహణీయులను ఆదర్శంగా చేసుకొని వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని సింగరేణి ప్లానింగ్ జనరల్ మేనేజర్ ఎస్.వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం మండలంలోని ఎస్‌సీబీ నగర్‌లో గల మోడ్రన్ ఇక్ర పాఠశాలలో వ్యక్తిత్వ వికాసంపై సదస్సును నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు బాధ్యతతో తమ విధులను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. చేస్తున్న ప్రతి పనిలో నిబద్ధతో లక్ష్యం సాధించే వరకు వెనకడుగు వేయవద్దు అన్నారు. తమ వద్ద ఉన్న విద్యను తోటి వారికి నేర్పేందుకు ఎళ్ళవేళల అవకాశం కోసం ఎదురు చూసి ఉపయోగించుకోవాలన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

ఇల్లెందురూరల్,ఫిబ్రవరి4:ఆదివాసీ పోడు రైతులు పోడు భూములపై సంపూర్ణ యాజమాన్య హక్కులు సాధించుకోవాడానికి కొమరం భీం పోరాట స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాకుల రవి పిలుపునిచ్చారు. ఆదివారం ఇల్లెందు పట్టణంలోని గోవింద్ సెంటర్‌లో గల పెన్షనర్స్ భవన్‌లో జరిగిన పోడు రైతుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఇల్లెందు డివిజన్‌లో పోడు రైతులను అధికారులు వేధిస్తూ అక్రమ కేసులు పెడుతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ పోడు రైతుల నుంచి అక్రమించిన భూములను తిరిగి ఆదివాసులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అనేక భూములను అటవీశాఖ అధికారులు గుంజుకున్నారని వాటిని తిరిగి ఆదివాసీ రైతులకు అప్పగించే వరకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ముత్తారపుకట్ట మాజీ సర్పంచ్ కృష్ణ, ఏటీఎఫ్ నాయకులు రమేష్‌బాబు, కుంజ కృష్ణ, పోడు రైతులు ప్రసాద్, జగ్గయ్య, రాములు, కాంతారావు, రామకృష్ణ, వినోద్, పోట్టయ్య, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎక్సలెంట్' వార్షికోత్సవం


చిన్నారుల నృత్య ప్రదర్శన

మణుగూరు, ఫిబ్రవరి 4: మణుగూరులోని సీ టైప్‌లో గల ఎక్సలెంట్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు, ఎంఈవో నాగేశ్వర్, మండల విద్యాశాఖ అధికారి వీరస్వామి హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. ప్రైవేటు జూనియర్ కళాశాల నిర్వాహకులు కోటేశ్వర్, కృష్ణ, శేషగిరిరావు, ప్రమీల, నాగేంద్ర, పి శంకర్, సింగరేణి వైద్యులు శేషగిరిరావు, సింగరేణి పాఠశాల హెచ్ఎం స్వరూపా రాణి, డాక్టర్ శశిధర్, ఎక్సలెంట్ పాఠశాల యాజమాన్య సభ్యులు ఖాదర్, ఎండీ యూసఫ్, యాకూబ్ షరీఫ్, సురేష్ ఖాన్ లెనిన్, నరేందర్ దండా రాధాకృష్ణ నర్సారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి


మాట్లాడుతున్న పొదెం వీరయ్య

దమ్మపేట, ఫిబ్రవరి 4: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య అన్నారు. సరోజనపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతు రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలంటే అందరు కలిసి ఐక్యంగా పనిచేసి విజయం సాధించాలన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 4: నాల్గో తరగతి ఉద్యోగులకు పదోన్నతులను కల్పించాలని పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జడ్పీ సమావేశం హాల్లో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వాలు మారుతున్నా నాలుగో తరగతి ఉద్యోగుల స్థితిగతులు అట్టడుగుకే పరిమితమయ్యాయని ఆరోపించారు. సుమారు 20 సంవత్సరాలుగా నాల్గొవ తరగతి ఉద్యోగులుగా కొనసాగుతూనే ఉన్నత చదువులు చదివి పదోన్నతులు రాకపోవడం గమనార్హమన్నారు. ఎంతో మంది వివిధ శాఖల ఉద్యోగులు పదోన్నతులు పొందుతున్నారని పంచాయతీ రాజ్‌శాఖ ఉద్యోగులు మాత్రం పధోన్నతులు నోచుకోలేదని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి అజయ్, వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన పంచాయతీ రాజ్ నాల్గొవ తరగతి ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 4: అశ్వారావుపేట పట్టణంలో ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగందర్ జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. పట్టణంలో రింగ్ రోడ్డు సెంటర్‌లో భారీ ఎత్తున యుగందర్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసారు. కేక్ కట్‌చేసి, మిఠాయిలు పంచారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పాలు, పండ్లు పంచారు.

చంద్రుగొండలో..


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

చంద్రుగొండ: మంత్రి తుమ్మల నాగేశ్వరావు కుమారుడు తుమ్మల యుగందర్ జన్మదిన వేడుకలు ఆదివారం చంద్రుగొండలో ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉప్పతల ఏడుకొండలు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రధాన సెంటర్‌లో వేదికను ఏర్పాటు చేసి 10 కేజీల కేక్‌కట్ చేసి యుగంధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ తండ్రి తుమ్మల ప్రజాసేవ చేస్తూ తుమ్మల బాటలో పయనిస్తున్న యుగందర్ కూడ చట్టసభల్లో అడుగు పెట్టాలని తుమ్మల అభిమానులు, జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు ఆకాంక్షిస్తున్నారని ఏడుకొండలతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మాళోత్ భోజ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేటలో..

దమ్మపేట: తుమ్మల యుగందర్ జన్మదిన వేడుకలు దమ్మపేట మండలంలలోని పలు గ్రామాలలో కాంగ్రెస్, టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గండుగులపల్లిలో ఎంపీపీ సోయం ప్రసాదు యుగందర్ జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. దమ్మపేట కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్, టీడీపీ నాయకులు వేడుకలు నిర్వహించారు. సొసైటీ ఛైర్మన్ ఎల్లిన రాఘవారావు, పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్ కేక్ కట్ చేసి పంపిణి చేసారు.

ముల్కలపల్లిలో

తుమ్మల యుగంధర్ జన్మదినోత్సవ వేడుకలు ములకలపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. జగన్నాధపురం, ముల్కలపల్లి గ్రామాలలో టపాసులు పేల్చి కేక్ కట్ చేసి జన్మదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడపా నాగేశ్వరావు, అమర్నాద్, నర్సింహారావు, కారం సుదీర్, అనమోలు నర్సింహారావు, రాజేష్, అప్పారావు, బుజ్జి, రత్నభూషణ్, జహీర్, కరుటూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లిలో..

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లిలో తుమ్మల యుగందర్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కేక్ కట్‌చేసి కార్యకర్తలకు, ప్రజలకు మిఠాయిలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వనమా గాంధీ, పర్సా వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ బోడా పద్మ, ఇనగంటి ప్రసాదు, లాకావత్ రాజు, వనమా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాల నిర్వహణపై కేసు నమోదు

దమ్మపేట, ఫిబ్రవరి 4: కోడిపందాల స్థావరంపై దమ్మపేట పోలీసులు దాడి చేసి ఆదివారం కేసు నమోదు చేసారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొండివర్రె గ్రామ సమీపంలో కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై సాయికిషోర్ రెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేసారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి వారి వద్ద నుంచి 2050 రూ.ల నగదుతో పాటు, రెండు ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకోని దమ్మపేట స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. కోడి పందాలు నిర్వహించడం చట్ట రీత్యా నేరమన్నారు. అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

నియామక పత్రాలు ఇవ్వాలి

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 4: సింగరేణిలో కారుణ్య నియామకంపై ఎంపికైన సింగరేణి కార్మికుల వారసులకు తక్షణమే పోస్టింగ్ ఇవ్వాలని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయుసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన సింగరేణి కార్మికుల పిల్లలు కారుణ్య నియామకంపై ఎంపికై వీటీసీ కోసం గత నాలుగు నెలలుగా ఎదురుచూస్తున్నారన్నారు. పోస్టింగ్‌లు ఇవ్వకపోవడంతో ఆయా కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలు పూర్తి అయి నెల పూర్తవుతున్న గుర్తింపు సంఘం ధృవపత్రాన్ని ఇంతవరకు అందజేయలేదని, వెంటనే అందజేయాలని కోరారు.

గోటి తలంబ్రాల తయారీ

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 4: మండల పరిధి రేగుబల్లి కృష్ణాలయంలో ఆదివారం గోటి తలంబ్రాల తయారీని భక్తులు ప్రారంభించారు. భద్రాచలంలో శ్రీరామనవమి కోసం తలంబ్రాల తయారీ కోసం జిల్లాలోని పలు ఆలయాలకు ధర్మ జాగరణ సంస్థ జిల్లా కో-ఆర్డీనేటర్ సుబ్రహ్మణ్యం వరి ధాన్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో జెట్టి వెంకట్రాజు, వెంకటరత్నం, వెంకటరమణ, రాణి, సావిత్రి పాల్గొన్నారు.

గుర్తింపు పత్రాన్ని అందించాలి



మాట్లాడుతున్న సారయ్య

ఇల్లెందు, ఫిబ్రవరి 4: సింగరేణి ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ ఎన్నికైనా గుర్తింపు పత్రం ఇవ్వకపోవడం సరికాదని సంఘం రాష్ట్ర నాయకులు కే. సారయ్య విమర్శించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో కార్మికులు గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీని గెలిపించారని వివరించారు. గత ప్రభుత్వం గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసినపట్టికి ఎన్నికలు జనపకుండా అడ్డుకుందన్నారు. తమ సంఘం ఆధ్వర్యంలో కోర్టు ద్వారా ఎన్నికలు జరిపే విధంగా కృషి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ దాసరి రాజారామ్, ఏఐఎస్ఎఫ్ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి హరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనానికి హాజరైన వారు

భద్రాచలం, ఫిబ్రవరి 4: భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1999-2002 సంవత్సర కాలంలో బీఏ పూర్తి చేసిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యనందించిన గురువులను గుర్తు చేసుకుంటూ తమ కళాశాలలో చదువుకున్న రోజుల్లో తాము పొందిన అనుభూతులను నెమరవేసుకున్నారు. 22 సంవత్సరాల తర్వాత మరోసారి తామందరం కలుసుకొని ఆనంద పరవశులమయ్యామని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మిల్టన్, ప్రొఫెసర్ కామేశ్వరరావు, విద్యాసాగర్, రామకృష్ణ, నాగమోహన్‌రావు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు సన్మానం


మంత్రి తుమ్మలను సన్మానిస్తున్న దృశ్యం

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 4: భద్రాచలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, రోటరీ క్లబ్ గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, భద్రాద్రి జిల్లా గాంధీపథం కన్వీనర్ చింతల చెరువు గేర్షం కోరారు. ఆదివారం హైదారాబాద్‌లో వారు మంత్రి తుమ్మలను కలిసి శాలువ కప్పి సన్మానించారు.